# బలగం TV BALAGAM

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 04 ఏప్రిల్ 2025 | www.balagamtv.com | పేజీలు 4




## నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం

**కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం**

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాల నేపథ్యంలో గురువారం పార్టీ అధినేత కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పార్టీ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ నెల 27న వరంగల్లో జరగనున్న బహిరంగ సభ, పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. పలు అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండు జిల్లాల ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. మిగితా 2వ పేజీలో

# రాష్ట్రంలో దంచిన వాన



- పలు చోట్ల పిడుగులు
- హైదరాబాద్ జలమయం

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గురువారం భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. వర్షంతోపాటు పిడుగులూ పడ్డాయి. ఈ వానతో ఇప్పుడిప్పుడే కోతలు మొదలై కల్లాలకు చేరుకుం టున్న ధాన్యం తడిసిపోయింది. టార్పాలిన్లు ఉన్న చోట కప్పినా వరదకు కొట్టుకుపో యింది. ఇక హైదరాబాద్ మహానగరంలో రోడ్లన్నీ కాలువలను తలపించాయి. మరోవైపు పిడుగు పడి నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ధాన్యం తడవకుం డా ఉండేందుకు రైతులు టార్పాలిన్లు కప్పేందుకు ఇబ్బందులు పడ్డారు. కామారెడ్డి జిల్లాలో పంట చేతికొచ్చే సమయంలో భారీ వర్షం కురిసింది. దోమకొండ, బీబీపేట్, మాచారెడ్డి, భిక్కనూర్ తదితర మండలా ల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం సుమారు గంట నుంచి రెండు గంటలపాటు కురిసింది. నిజామాబాద్ జిల్లాలోని భీంగల్, మండల కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయిం ది. రామారెడ్డి మండలంలో వరి ధాన్యం తడిసి ముద్దయింది. రంగారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, మియాపూర్ ప్రాంతాల్లో వర్షం పడి రోడ్లపై వరద పొంగిపొర్లడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శంషాబాద్ మండలంలోని రైల్వే కమాన్, బస్ స్టేషన్, మధురనగర్ ఆదర్శ కాలనీలలోకి భారీగా నీరు చేరింది. శంకర్‌పల్లి మండలం సింగపూర్ వార్డులో పిడుగు పడి గేదె మృత్యువాత పడింది. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని పాములపర్తి, చేబర్తి, ఎర్రవల్లి తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం దంచికొట్టింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మార్కెట్ యార్డ్‌లో పొద్దు తిరుగుడు ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. రాయపోల్ మండలం అనాజ్‌పూర్, తిమ్మక్కపల్లి గ్రామాల ధాన్యాన్ని మార్కెట్లో విక్రయానికి ఉంచగా.. 10 రోజులుగా కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలోని ఇశ్రితాబాద్‌లో బలరాం లచ్చయ్య చెట్టు కింద మేకలను మేపుతుండగా, పిడుగుపడి 20 మేకలు మృత్యువాతపడ్డాయి.

హైదరాబాద్‌లో వాన దంచికొట్టింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నాలాలు, డ్రయినేజీలు పొంగి పొర్లాయి. పలు బస్తీలు, కాలనీల్లో ఇండ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఖైరతాబాద్‌లోని మెర్క్యూరీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. సచివాలయం ముందుభాగం చెరువును తలపించింది. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద ప్రవహించడంతో ట్రాఫిక్ జామ్ అయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. ఈ వర్షాల వల్ల చార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి పెచ్చులు ఊడిపోయి భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం ముందు పడ్డాయి. పెచ్చులుడిన భాగాన్ని గుర్తించిన పురావస్తు శాఖ అధికారులు.. మరమ్మతులు నిర్వహిస్తామని తెలిపారు. చైతన్యపురి ఫణిగిరి కాలనీలోని కొసగుండ్ల లక్ష్మీ నర్సింహ్మస్వామి దేవాలయం పక్కన శివాలయం మూసీ మధ్యలో ఓ బండపై ఉండగా.. అక్కడ ఇద్దరు మేస్త్రీలు దిమ్మెను నిర్మిస్తుండగా భారీ వర్షం కురవడంతో వారు అక్కడే చిక్కుకుపోయారు. అధికారులు వారిని రక్షించారు.

## అప్రమత్తంగా ఉండాలి

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



అకాల వర్షాల వల్ల హైదరాబాద్ నగరంలో ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కొనడానికి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. భారీ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, ఈదురుగాలుల కారణంగా తలెత్తిన పరిస్థితుల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ సహాయక చర్యల కోసం అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.నగరంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారిని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రదేశాల్లో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా, విద్యుత్ అంతరాయాలు లేకుండా జీహెచ్ఎంసీ, పోలీసు, హైడ్రా విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో వెంటనే సమస్యను పరిష్కరించి సరఫరాను పునరుద్ధరించాలని చెప్పారు. జలమయమైన కాలనీల్లో ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అన్నారు. పోలీసులు క్షేత్రస్థాయిలో ఉండి ట్రాఫిక్ సమస్యను ఎక్కడికక్కడ పరిష్కరించాలని చెప్పారు. పలు జిల్లాల్లో కూడా వర్షాలు, ఈదురుగాలులు, వడగండ్లు పడుతున్నందున జిల్లా కలెక్టర్లు, పోలీసు యంత్రాంగం, ఇతర అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

### కంచ గచ్చిబౌలి భూముల్లో
# ఎలాంటి పనులు చేపట్టొద్దు

- స్టే విధించిన సుప్రీంకోర్టు
- తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి కార్యకలాపాలు చేపట్టొద్దు
- నెలరోజుల్లో నిపుణుల కమిటీ వేసి, ఆరు నెలల్లో నివేదిక ఇవ్వాలి
- ఆదేశాలు పాటించకపోతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిదే బాధ్యత
- ఈనెల 16లోపు ఆ ప్రాంతాన్ని సందర్శించి అఫిడవిట్ దాఖలు చేయాలి
- సుప్రీంకోర్టు



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశలు జారీ చేసింది. సుమోటాగా కేసు స్వీకరించిన ధర్మాసనం.. ఆ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టొదంటూ స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకూ తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఉన్నత న్యాయస్థానం గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంపై జస్టిస్ గవాయ్ ధర్మాసనం సీరియస్ అయ్యింది. మూడ్రోజుల వ్యవధిలో వంద ఎకరాల్లో చెట్లు కొట్టేయడం మామూలు విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీన్ని చాలా సీరియస్ అంశంగా పరిగణించింది. చట్టాన్ని చేతుల్లోకి ఎలా తీసుకుంటారంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని జస్టిస్ గవాయ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఇది చాలా తీవ్రమైన అంశమని మండిపడింది. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను ఉన్నత న్యాయస్థానం పరిశీలించింది. అలాగే మీడియా, పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం జస్టిస్ గవాయ్ ధర్మాసనం ముందు అమికస్ క్యూరీ పరమేశ్వర్ ఉంచగా.. వాటినీ పరిశీలించింది. కాగా, ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని సుప్రీంకోర్టు ప్రతివాదిగా చేర్చింది. ఇంత అత్యవసరంగా భూముల్లో చెట్లు తొలగించి పనులు చేపట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది.

తెలంగాణ ప్రభుత్వం గత నెల 15న నియమించిన కమిటీలోని అధికారులు సైతం సమాధానం చెప్పాలని హుకుం జారీ చేసింది. ఎలాంటి ఉల్లంఘనలు జరిగినా.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఒకవేళ ఇది అటవీ ప్రాంతం కాకపోయినా.. చెట్లు కొట్టేసే ముందు సీఈసీ అనుమతి తీసుకున్నారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన నివేదికలోని ఫొటోలు చూసి అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని చెప్పింది. వందల కొద్దీ యంత్రాలు మోహరించాల్సిన అగత్యం ఏంటో అర్థం కావడం లేదని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం చేపట్టిన పనులపై స్టే విధించింది ఉన్నత న్యాయస్థానం. సుప్రీంకోర్టు తీర్పుపై హెచ్‌సీయూ విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మంత్రుల బృందంతో కమిటీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

**కంచ గచ్చిబౌలి భూముల విషయంలో తదుపరి కార్యాచరణపై మంత్రుల బృందంతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. కంచ గచ్చిబౌలి భూ సమస్యల పరిష్కారం దిశగా ఈ కమిటీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కార్యనిర్వాహక కమిటీతో, జేఏసీ మరియు పౌర సమాజ సమూహాలతో, విద్యార్థుల ప్రతినిధి బృందంతో, అలాగే సంబంధిత స్టేక్ హోల్డర్లు అందరితోనూ సంప్రదింపులు జరుపుతుందని ముఖ్యమంత్రి ఎక్స్‌లో పేర్కొన్నారు.**



## సుంకాలు విధించిన డొనాల్డ్ ట్రంప్..

- 50 దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్ ప్రభుత్వం
- భారత్ సరఫరాలపై 26 శాతం టారిఫ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పినట్లుగానే పలు దేశాలపై టారిఫ్ వార్ ప్రకటించారు. తాజాగా.. విదేశీ ఉత్పత్తులపై భారీగా సుంకాలు వడ్డించారు. భారతదేశం ఉత్పత్తులపై 26శాతం టారిఫ్ వసూళ్లు చేస్తామని ప్రకటించిన ట్రంప్.. అన్ని దేశాల నుంచి దిగుమతి అయ్యే ఆటో మొబైల్స్ పై 25శాతం సుంకం విధిస్తున్నట్లు స్పష్టం చేశారు. ట్రంప్ అమెరికాలోకి ప్రవేశించే అన్ని వస్తువులపై కొత్త దిగుమతి సుంకాలను ప్రకటించారు. అయితే, ఇది రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ వాణిజ్య క్రమంలో జరిగిన అతిపెద్ద నిర్ణయంగా నిపుణులు పేర్కొంటున్నారు. ట్రంప్ దెబ్బకి ఆసియా మార్కెట్లు చుక్కలు చూస్తున్నాయి. జపాన్ లీడింగ్ స్టాక్ ఇండెక్స్ నిక్కీ 3.5శాతం అంటే భారీగా దాదాపు 1135 పాయింట్లు పడిపోయింది. మరోవైపు యూఎస్ సొంత మార్కెట్ కూడా బాగానే ప్రభావితమవుతోంది. భారతదేశంలోని స్టాక్ మార్కెట్లపైనా ఈ ప్రభావం ఉంటుందని తెలుస్తోంది.

ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ట్రంప్ పన్నులపై స్పందించాయి. కొన్ని దేశాలు సుంకాలను సమర్థించగా.. చాలా దేశాలు వ్యతిరేకించాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ దశాబ్దాలుగా అమెరికాతో చేస్తున్నట్లే తన వాణిజ్య భాగస్వాములతో కూడా అమెరికా అదే చేస్తుందని అన్నారు. ఇకపై అలా జరుగదన్నారు. ఉద్యోగాలు, కంపెనీలు తిరిగి అమెరికాకు వస్తాయన్నారు. ఇది ఆర్థిక సమస్యగా మాత్రమే కాకుండా జాతీయ భద్రతా సమస్యగా ట్రంప్ అభివర్ణించారు. ట్రంప్ ప్రతీకార సుంకాలకు బ్రిటన్ మద్దతు తెలిపింది. అమెరికా బ్రిటన్‌కు అత్యంత సన్నిహిత మిత్రదేశమని బ్రిటిష్ ప్రభుత్వం తెలిపింది. ట్రంప్ ప్రకటించిన బ్రిటిష్ వస్తువులపై 10 శాతం సుంకాల ప్రభావాన్ని తగ్గించడానికి బ్రిటన్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఆశిస్తున్నట్లు వాణిజ్య కార్యదర్శి జోనాథన్ తెలిపారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ప్రతీకార సుంకాలపై భారత వాణిజ్య శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. అమెరికా వాణిజ్య విధానంలో జరిగిన నూతన పరిణామం వల్ల ఏర్పడే అవకాశాలపై తాము ప్రస్తుతం అధ్యయనం చేస్తున్నామని వెల్లడించింది. అమెరికా సర్కారు నూతన విధానాల వల్ల భారత్‌పై ఎలాంటి ప్రభావం ఉంటుందనే దానిపై సమీక్షిస్తున్నట్లు తెలిపింది. “మేం వికసిత భారత్ లక్ష్యంగా మేధోమథనం చేస్తున్నాం. అమెరికాకు ఎగుమతులు చేసే అన్ని రంగాలతో సంప్రదింపులు జరుపుతున్నాం. వారి అభిప్రాయాలను సేకరిస్తున్నాం. ట్రంప్ విధించే అదనపు దిగుమతి సుంకాల వల్ల ఎలాంటి ప్రభావం పడుతుందనేది తెలుసుకుంటున్నాం” అని భారత వాణిజ్య శాఖ పేర్కొంది. “ప్రస్తుతం భారత్, అమెరికా వాణిజ్య సంఘాల మధ్య ముమ్మర చర్చలు జరుగుతున్నాయి. వివిధ రంగాల్లో ఇరువైపులా ప్రయోజనకరంగా ఉండేలా ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇరుదేశాల సప్లై చైన్ వ్యవస్థలను మరింత బలంగా ఏకీకృతం చేసే అంశంపైనా సంప్రదింపులు జరుగుతున్నాయి” అని భారత వాణిజ్య శాఖ స్పష్టం చేసింది.

# కంచ గచ్చిబౌలి భూములను కొనవద్దు

## బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక వెనక్కి తీసుకుంటాం



- అక్కడ ఓ అద్భుతమైన లంగ్స్ పేస్‌ను ఏర్పాటు చేస్తాం
- రాహుల్ గాంధీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి రావాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

క కంచ గచ్చిబౌలి భూములను ఎవరూ కొనుగోలు చేయొద్దని.. మూడేళ్ల తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వం ఆ భూములను వెనక్కి తీసుకుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. 400 ఎకరాల్లో అతిపెద్ద ఎకో పార్కుని ఏర్పాటు చేసి హైదరాబాద్ ప్రజలు, హెచ్‌సీయూ విద్యార్థులకు కానుకగా ఇస్తామన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ‘మా పార్టీ తరపున ఓ మాట ఇస్తున్నాం. మూడేళ్లలో ప్రభుత్వంలోకి వస్తున్నాం. ప్రభుత్వంలోకి వచ్చాక ఆ 400 ఎకరాలను హైదరాబాద్, తెలంగాణలోనే అతిపెద్ద ఎకో పార్కుగా ఏర్పాటు చేస్తాం. ఇప్పుడే మేం స్పష్టం చేస్తున్నాం. ఎవరైనా రేవంత్‌రెడ్డి విసిరే బిస్కెట్లకు ఆశపడి.. రేవంత్‌రెడ్డి చెప్పే మాటలకు ఆశపడి ఆ ల్యాండ్‌లో ఒక ఇంచు కొనుగోలు చేసినా తిరిగి వెనక్కి తీసుకుంటాం’ అని స్పష్టం చేశారు.‘అద్భుతమైన ఎకో పార్కుని హైదరాబాద్ ప్రజలకు కానుకగా అందిస్తాం. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులకు, హైదరాబాద్ ప్రజలకు గిఫ్ట్‌గా ఇస్తాం. హైదరాబాద్ ప్రజలు మాకు ఓట్లేసి గెలిపించారు. కాంగ్రెస్‌కు ఒక్క సీట్ ఇవ్వకుండా గెలిపించారు. 400 ఎకరాలను పొరపాటున ఎవరూ కొనవద్దు. కొంటే నష్టపోతారు. తర్వాత తప్పు పట్టొద్దు. ప్రభుత్వంలోకి వచ్చాక కాదు.. మూడేళ్ల ముందుగానే చెబుతున్నాం. ఈ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ విస్తరణ కాంక్షతో పని చేస్తుంది. మేం మాత్రం భవిష్యత్ తరాల కోసం ఆలోచిస్తున్నాం. వచ్చే తరాల కోసం ఆలోచించాలని మా నేత కేసీఆర్ చెప్పారు. మొన్నటి వరకు ఆ జాగ కోర్టులో ఉంది. ప్రైవేటు వ్యక్తులది కాదు.. ప్రభుత్వానిది కాదని కొట్లాడం. దాంతోనే ఆ ల్యాండ్ ప్రజలకు వచ్చింది. మేం కొట్లాడింది రియల్ ఎస్టేట్ కోసం కాదు కొట్లాడింది. ఆ ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ జరగాలి.. ఢిల్లీ మాదిరిగా మన నగరం మారొద్దు.. గాలి కాలుష్యంతో మాస్కులు వేసు కొని తిరిగి పరిస్థితి ఢిల్లీలో

ఉన్నది. ఆ పరిస్థితి హైదరా బాద్‌కు రావొద్దని.. భవిష్యత్ తరాలు బాగుండాలంటే.. 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను ఎకో పార్కుగా మిగితా 2వ పేజీలో

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వాదనలు పూర్తి

- తీర్పు రిజర్వు చేసిన సుప్రీంకోర్టు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల వ్యవహారంపై గురువారం సుప్రీం కోర్టులో విచారణ ముగిసింది.. స్పీకర్ కార్యదర్శి తరపున అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపించారు. స్పీకర్ నిర్ణయానికి కాలపరిమితి విధించే విషయంలో ఇప్పటి వరకు ఎలాంటి తీర్పులు లేవని సింఘ్వి తెలిపారు. మణిపూర్ వ్యవహారం పూర్తిగా భిన్నమైనదని, ఆ ఒక్క విషయాన్ని ప్రత్యేకంగా పరిగణించారని అన్నారు. అలాగే రాణా కేసు పూర్తిగా ప్రత్యేకమైనదని, ప్రస్తుత ఆ అంశానికి సరిపోదని సింఘ్వి కోర్టుకు తెలిపారు. దీంతో రాణా కేసులో కోర్టు జోక్యం చేసుకుని అనర్హత విధించిందని జస్టిస్ గవాయ్ తెలిపారు. మీ దృష్టిలో రీజనబుల్ టైమ్ అంటే ఏంటి అని సింఘ్విని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. న్యాయవాదులు ఇలాంటి కేసుల విషయంలో వ్యవహరించే విధానం చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సుప్రీం ర్టుకు వచ్చిన తర్వాత న్యాయవాదుల తీరు పూర్తిగా మారిపోతోందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. ఇదే అంశంపై బుధవారం కూడా సుదీర్ఘవిచారణ జరిగింది. స్పీకర్ తరపున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. గురువారం స్పీకర్ కార్యదర్శి తరపున సింఘ్వి వాదనలు వినిపించారు. ఇటీవల సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటలను కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది మరోసారి ప్రస్తావించారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావని, స్పీకర్ తరపున కూడా చెపుతున్నా అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయవాది ప్రస్తావించారు. అసెంబ్లీలో మాట్లాడితే ఏ కోర్టు నుంచి అయినా రక్షణ ఉంటుందని వ్యాఖ్యానించారని న్యాయవాది అన్నారు. దీంతో ముఖ్యమంత్రి కనీసం స్వీయ నియంత్రణ పాటించలేరా అని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. మిగితా 2వ పేజీలో

# రాజ్యసభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

- బిల్లు ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో



కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు రాజ్యసభలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 12 గంటల సుదీర్ఘ చర్చ అనంతరం ఆమోదం పొందిన మరుసటి రోజే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తులను ముస్లిమేతరులు నిర్వహిస్తారనే తప్పుడు అభిప్రాయాన్ని ప్రతిపక్షాలు వ్యాప్తి చేస్తున్నాయని, అందులో నిజం లేదని రిజిజు స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు భారీ భూ బ్యాంకును కలిగి ఉన్నప్పటికీ ముస్లిం సమాజం ఎలా బాధపడుతోందో సచార్ కమిటీ నివేదిక పేర్కొన్న వైనాన్ని ఆయన ఉటంకించారు.

రాజ్యసభలో రిజిజు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013లో వక్ఫ్ బిల్లుకు సవరణలు చేసిందని, ఆ తప్పులను తాము తాజాగా చేసిన సవరణలు ఎలా సరిదిద్దుతాయో కూడా వివరించి చెప్పారు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని 2013లో సెలెక్ట్ కమిటీ అంగీకరించిందని, దేశంలోనే ఇది మూడవ అతిపెద్ద భూ యజమానిగా ఉన్నప్పటికీ, మైనారిటీ వర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని అన్నారు.వక్ఫ్ బోర్డుల కూర్పు గురించి వివరిస్తూ... కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో వక్ఫ్ బోర్డుల పాలకవర్గాల్లో మహిళా సభ్యులను చేర్చడానికి సంబంధించి ఒక ముఖ్యమైన సంస్కరణను తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కేంద్ర వక్ఫ్ మండలిలో 10 మంది సభ్యులు ఉంటారని, అందులో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని, నలుగురు వ్యక్తులు భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శి వంటి జాతీయ స్థాయి ప్రముఖులు ఉంటారని కిరణ్ రిజిజు వివరించారు. రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులో 11 మంది సభ్యులు ఉంటారని, అందులో ముగ్గురు ముస్లిమేతరులు ఉండవచ్చని, ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు.వక్ఫ్ బోర్డులోని సెక్షన్ 40ను రద్దు చేశామని, దీని ద్వారా ఏ ఆస్తి అయినా తమదేనని మతపరమైన సంస్థ క్లెయిమ్ చేసే అధికారం ఉండేదని తెలిపారు. ప్రభుత్వ భూమిని వక్ఫ్ క్లెయిమ్ చేయకూడదని, షెడ్యూల్డ్ తెగల ఆస్తులను మార్చడానికి వీల్లేదని, వాటిని వక్ఫ్ ఆస్తులుగా మిగితా 2వ పేజీలో

# చలో సెక్రటేరియట్ ఉద్రిక్తం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్ యూ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హెచ్ సీయూ భూములు అమ్మవద్దని, ఓయూలో వీసీ తీసుకువచ్చిన అప్రజాస్వామిక సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ‘చలో సచివాలయ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమం ఉద్రిక్తంగా మారడంతో ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం నుండి సచివాలయం వైపు బయలుదేరిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను బుద్ధ భవన్ సమీపంలో పోలీసులు అడ్డుకోగా పోలీసులకు, వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులకు తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగింది.దీంతో పలువురి నాయకులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు



**బలగం టీవి, హైదరాబాద్**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి గురువారం బాంబు బెదిరింపు వచ్చింది. కలెక్టరేట్‌ను పేల్చివేస్తామని ఓ ఆగంతకుడు కలెక్టరేట్‌కు మెయిల్ పెట్టాడు. అధికారులు ఈ విషయాన్ని కలెక్టర్ గౌతమ్ దృష్టికి తెచ్చారు. దాంతో కలెక్టర్ గౌతం పోలీస్ శాఖ వారికి సమాచారం అందించారు. వెంటనే బాంబు స్క్వాడ్ పోలీస్ బృందాలు కలెక్టరేట్‌కు చేరుకుని మూడు ఫ్లోర్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే కలెక్టరేట్ ప్రాంగణంతో పాటు కాంపౌండ్ వాల్ చుట్టూ తనిఖీ చేశారు. అనంతరం బాంబు బెదిరింపు తప్పుడు సమాచారం అని కలెక్టర్‌కు పోలీసులు తెలిపారు. బాంబు బెదిరింపుపై తదుపరి విచారణ చేయాలని వారిని కలెక్టర్ ఆదేశించారు. మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరు పంపించారు అనే అంశంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.



# బండెనక బండి కట్టి గులాబీల జెండ పట్టి...

- **బీఆర్ఎస్ రజతోత్సవ పాటను విడుదల చేసిన కెసిఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

రచయిత, గాయకుడు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ రచించి గానం చేసిన "బండెనక బండి కట్టి – గులాబీల జెండ పట్టి " బీఆర్ఎస్ రజతోత్సవ పాటను పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ఎర్రవెల్లి నివాసంలో ఆవిష్కరించారు. నాటి నుండి నేటి వరకు బీఆర్ఎస్ ప్రస్థానాన్ని పేర్కొంటూ రజతోత్సవం సందర్భంగా పాటలు, కళారూపాల్ని రూపొందించాలని ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్ రసమయికి సూచించారు. కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్, నర్సింగ్ కళాశాలల

# హాస్టల్స్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**మెడికల్ హబ్‌గా ఆందోల్**

**వట్పల్లి, కంకోల్ పీహెచ్‌సీల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష**

**సంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమీక్ష**

**బలగం టీవి, హైదరాబాద్**

సంగారెడ్డి మెడికల్ కళాశాల, ఆందోల్ నర్సింగ్ కళాశాల లోని హాస్టల్స్ నిర్మాణ పనులు వెంటనే పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య , ఇంజనీరింగ్ శాఖ అధికారులకు దిశ నిర్దేశం. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తో కలిసి కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో DMHO, TGMSIDC% ఇంజనీరింగ్ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్, సంబంధిత శాఖల అధికారులతో వైద్య,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు , నిర్మాణం పనుల పై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సంగారెడ్డి మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో విద్యార్థుల వసతి గృహం నిర్మాణం పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తరగతి గదుల నిర్మాణం, అడ్మినిస్ట్రేటివ్



కార్యాలయ భవనాల నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న అందోల్ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణంతో పాటు విద్యార్థుల వసతి గృహం నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఆందోల్ ను మెడికల్ హబ్ గా రూపొందించడంలో భాగంగా వట్పల్లి, కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పనులు వెంటనే పూర్తిచేసి ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, నిర్మాణ పనుల లో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని , వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత పథకంలో భాగంగా ఆందోల్ – జోగిపేట కేంద్రంలోని మార్కెట్ గంజ్ లో ఏర్పాటు చేసిన సన్నబియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు సన్న బియ్యంను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్లను, ఇండ్ల స్థలాలను అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల 85 లక్షల మంది లబ్ధిదారులకు ఒక కోటి 81లక్షల 696 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ప్రతి కుటుంబంలోని సభ్యులకి 6 కిలోల చొప్పున సన్న బియ్యంను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. సంగారెడ్డి జిల్లాలోని 846 చౌక ధరల దుకాణాల ద్వారా 3లక్షల 78, 728 తెల్ల రేషన్ కార్డులు, అందులో 26, వేల 115 అంత్యోదయ కార్డులు, 100 అన్నపూర్ణ కార్డుల ద్వారా 12 లక్షల 32,274 మంది సభ్యులకు సన్నబియ్యం పంపిణీ ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి వెల్లడించారు.

ఆహార భద్రత కార్డులోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకు ఆరుకిలోల చొప్పున, అంత్యోదయ కార్డు ఒక్కంటికి 35కిలోల చొప్పు న, అన్నపూర్ణ కార్డు ఒక్కంటికి 10 లోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులందరికి నాణ్యమైన బియ్యాన్ని అందజేస్తున్నామన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ మాధురి, ఆర్డీఓ పాండు, మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, అంబదాసు, నియోజకవర్గ నాయకులు సురేందర్ గౌడ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వాదనలు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

గతంలో కూడా ఇలాంటి ఘటనే జరిగిందని, ఆ తర్వాత కూడా ఇలాగే వ్యవహరిస్తే ఎలా అని జస్టిస్ గవాయ్ అన్నారు. దీంతో అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ ప్రతిపక్షం నుంచి అంతకు మించిన రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఇప్పుడు అవన్నీ అప్రస్తుతం అని ధర్మాసనం పక్కన పెట్టింది. సీఎం మాటలు కోర్టు దిక్కారం కింద తీసుకోవాల్సి వస్తుందని జస్టిస్ గవాయ్ అన్నారు. మేము సంయమనం పాటిస్తున్నామని, మిగతా రెండు వ్యవస్థలు అదే గౌరవంతో ఉండాలని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌కు పిర్యాదు చేసిన తర్వాత కోర్టులో కేసులతో తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని చూసారని సింఘ్వి అన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన సూచనలను సానుకూలంగా తీసుకుని ఉంటే కేసు ఇక్కడివరకు వచ్చేది కాదని జస్టిస్ గవాయ్ అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసి విచారణకు వచ్చిన తర్వాతే నోటీసులు ఇచ్చారని గవాయ్ అన్నారు. ఈ క్రమంలో మణిపూర్ వ్యవహారం, రాణా కేసుతో పాటు మరికొన్ని అంశాలను అభిషేక్ సింఘ్వి కోర్టుకు వివరిస్తూ వాదనలు ముగించారు. అభిషేక్ మను సింఘ్వి వాదనలు ముగియడంతో.. పిటీషనర్ల తరపున కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది ఆర్యామ సుందరం మరోసారి చివరి వాదనలు వినిపించారు. మహారాష్ట్ర వ్యవహారం సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ నిర్ణయంపై సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. స్పీకర్‌కు తగిన ఆదేశాలు ఇవ్వడానికి సుప్రీంకోర్టుకు అన్ని అధికారాలు ఉన్నాయన్నారు. సుభాష్ దేశాయ్ కేసులో స్పీకర్ తప్పక తగిన సమయంలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని రాజ్యాంగ ధర్మాసనం తీర్పులో పేర్కొందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు.

జనవరిలో సుప్రీంకోర్టు విచారణ ప్రారంభించాక స్పీకర్ నోటీసులు ఇచ్చారని, మూడు వారాలు సమయం ఇచ్చారని, ఆ మూడు వారాల సమయం కూడా పూర్తి అయిందని న్యాయవాది ఆర్యామ సుందరం అన్నారు. నోటీసులు పంపిన సమాచారం కూడా ప్రతిపక్ష నేతకు ఇవ్వలేదని న్యాయవాది పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు మరోసారి ప్రస్తావించారు. దీనిపై న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యంతరం చెప్పారు. ధర్మాసనం కూడా తాము ఆ విషయంలోకి వెళ్లడం లేదని స్పష్టం చేసింది. దీంతో పిటిషన్‌పై విచారణ ముగిసింది. తీర్పును రిజర్వు చేసింది. అయితే 8 వారాల్లోగా తీర్పు ఇవ్వాలని సుప్రీం కోర్టును న్యాయవాది ఆర్యమ సుందరం కోరారు.

# రాజ్యసభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు రెండు పెద్ద సవరణలను చేశామని రిజిజు రాజ్యసభకు తెలియజేశారు.

**వ్యతిరేకించిన కాంగ్రెస్**

వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ముస్లింలను లక్ష్యంగా చేసుకొని సమాజంలో మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడానికి బీజేపీ ఈ బిల్లు తెచ్చిందని దుయ్యబ ట్టింది. రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున చర్చను ప్రారంభించిన ఎంపీ సయ్యద్ నాసిర్ హుస్సేన్ అధికార పార్టీ దేశ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని విమర్శిం చారు. జేపీసీలో ప్రతిపక్షాలు చేసిన ఏ ఒక్క సిఫార్సును కూడా ఈ బిల్లులో చేర్చలేదని అన్నారు. ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించేలా ఈ బిల్లు ఉందని కాంగ్రెస్ ఎంపీ ఆరోపించారు. రాజ్యసభలో ఈ బిల్లును బుల్డోజ్ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 240 స్థానాలు గెలుపొందిన బీజేపీ తన ఓటుబ్యాంక్‌ను పెంచుకునేందుకు 2024లో ఈ బిల్లు తెచ్చిందని కాంగ్రెస్ ఎంపీ హుస్సేన్ ఆరోపించారు.

# కంచ గచ్చిబౌలి భూములను కొనవద్దు

(మొదటి పేజీ తరువాయి)

మారుస్తాం' అని స్పష్టం చేశారు.'పిల్లలు ఆందోళన చేస్తున్నారని.. వారితో కలవాలని మా నేతలు అంటున్నారు. మేం కూడా వెళ్లాలని ఆలోచి ంచాం.. ఈ దుర్మార్గ కాంగ్రెస్ వాళ్లు మేం అడుగు పెట్టగా నే.. బీఆర్ఎస్ వాళ్లు నడిస్తున్నారని అందుకే కొద్దిగా దూరం ఉన్నాం. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే.. హైదరాబాద్ ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులందరం హెచ్‌సీయూకి వెళ్తాం. ప్రభుత్వం వెనక్కి తగ్గి తీరాల్సిందే. ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టం. రాజ్యసభలో ఫ్లోర్ లీడర్ సురేశ్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గట్టిగానే మాట్లాడారు. కేంద్రం జోక్యం చేసుకోవాలని.. హెచ్‌సీయూలో ఆందోళన జరుగుతుందని ప్రస్తావించారు. అట్లాగే హెచ్‌సీయూ విద్యార్థులు ఢిల్లీకి వెళ్తాం అపాయింట్‌మెంట్ ఇప్పించాలంటే ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిపించాం. వారికి మద్దతు ఇస్తున్నాం. లీగల్‌గా కొట్లాడుతున్న విద్యార్థులు, ఎన్‌జీవోలకు మద్దతు ఇస్తాం. ఇది రాజకీయ పోరాటం కాదు.. హైదరాబాద్, తెలంగాణ భవిష్యత్ కోసం పోరాటం. భూముల పరిరక్షణ కోసం పోరాడుతున్న వారికి మద్దతుగా ఉంటాం' అని హామీ ఇచ్చారు.

మంత్రులు పనికి మాలిన మాటలు మాట్లాడుతున్నరు. ఎక్కడ ఏం ఉందో వివరాలన్నీ ఉన్నయ్. ఇది నా రిపోర్ట్ కాదు. ఇండిపెండెంట్ ఏజెన్సీలు, హెచ్‌సీయూలో ఉండే ప్రొఫెసర్లు తయారు చేసిన రిపోర్ట్‌లో బోలెడు విషయాలు ఉన్నాయి. భూముల్లో చెరువులు, తాబేళ్లు, నెమళ్లు, జంతువులు ఉన్నయ్. ఇవన్నీ హెచ్‌సీయూ,హెచ్‌ఆర్‌సీ వెబ్‌సైట్‌లో వివరాలు ఉన్నాయి. యుద్ధానికి ఎలాగైతో వెళ్తారో.. మిలటరీ ట్యాంకులు వేసుకొని వెళ్లినట్లుగా దొంగలా బుల్డోజర్లు మోహరించింది. అక్కడ ఉండేది ఒకటి రెండు కాదు జంతువులు. అక్కడ నివసించే వారికి తెలుస్తుంది. రాహుల్ గాంధీని చివరగా అడుగుతున్నాం. పెద్దపెద్ద ఉపన్యాసాలు, మాటలు చెబుతుంటారు. మీరు ఆనాడు రోహిత్ వేముల విషయంలో.. మీరొస్తే హెచ్‌సీయూలో నిరసనలో పాల్గొనే ప్రజాస్వామిక పరిస్థితు ఆ నాడు కేసీఆర్ పాలనలో ఉండేది. మీరు, మీ ప్రభుత్వం ఏం చేస్తుంది ఇవాళ? ఆడపిల్లల జుట్లు జుంగడం, బట్టలు చినిగేలా కొట్టడం.. లాఠీఛార్జ్‌లు చేస్తున్నారు?' అంటూ మండిపడ్డారు.

'హైదరాబాద్‌లో టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ క్యాంపెయిన్ రన్ చేశారు ఆ మధ్యలో.. హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్ల ఓవర్లు ఎస్ఆర్‌డీపీ కింద.. సేవ్ కేబీఆర్ అంటూ క్యాంపెయిన్ ప్రారంభించారు 700 చెట్లు కొట్టేస్తున్నారని. అక్కడ కేబీఆర్ వాకర్స్ నిరసన తెలిపితే మేం వెనక్కి తీసుకున్నాం. వాళ్ల కోసమే చేస్తున్నాం.. వాళ్లు వద్దనప్పుడు కేసీఆర్ ఆపేయాలని అన్నారు. ప్రజాస్వామిక లక్షణం ఆ పని చేస్తారు. ప్రజలు ఎప్పుడైనా ఏదైనా చెబితే వింటారు. నా అంత గొప్పవారు లేరనుకుంటే రేవంత్‌రెడ్డిలా ఉంటది. రేవంత్ అక్కడ ఏం లేవంటారు.. జింకలను పట్టుకొని నెహ్రూ జులాజికల్ పార్క్‌లో పెట్టారు. ఇది పార్క్ రిపోర్ట్‌లో స్పష్టంగా హెచ్‌సీయూలో జింకలు దొరికాయని.. మరి ముఖ్యమంత్రికి జింకలు కనపడుతయలేవటా? గుంట నక్కలు కనబడుతున్నయటా.. దేశమంతా కోడై కూస్తున్నా.. రేవంత్‌రెడ్డికి అర్థం కావడం లేదు అని అన్నారు.

# నాయకులకు కేసీఆర్ దిశానిర్దేశం

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యేలు డా. కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్ రెడ్డి, అనిల్ జాదవ్, కోవా లక్ష్మి, పార్టీ జిల్లా అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు (కరీంనగర్), తోట ఆగయ్య (సిరిసిల్ల), జోగు రామన్న (ఆదిలాబాద్) తదితరులున్నారు.



## తిమ్మాపూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డి పేట మండలం తిమ్మాపూర్ గ్రామంలో 5 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ ను బిజెపి నాయకులు చేశారు. మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.... అడగ్గానే తిమ్మాపూర్ పోచమ్మ గుడికి సీసీ రోడ్డుకు నిర్మాణానికి 5 లక్షల రూపాయలు కేటాయించిన కేంద్ర మంత్రివర్యులు పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పలు గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించడంతో వర్షం వ్యక్తం చేశారు.ఇంకా మండలంలోని గ్రామల అభివృద్ధి కోసం మరిన్ని నిధులు తీసుకొస్తూ గ్రామల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తాం అని తెలిపారు..ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పొన్నాల తిరుపతి రెడ్డి ప్రధాన కార్యదర్శి చందుంపట్ల లక్ష్మరెడ్డి,సీనియర్ నాయకులు పటూరి రాజేష్ గుప్తా, ప్రతిప్ రెడ్డి,ఉపాధ్యక్షులు దాసరి గణేష్,కృష్ణ హరి, మండల పట్టణ అధ్యక్షులు నంది నరేష్,జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు యాదగిరి,సోషల్ మీడియా కన్వీ నర్స్ కిరణ్ నాయక్, ప్రకాష్,నవీన్,గ్రామ బీజేపీ నాయకులు బూత్ అధ్యక్షులు కొండా ప్రశాంత్, అరిగేలా సతీష్, డాక్టర్ సతీష్, బుర్కా వేణు, అబ్దుల్ గ్రామస్తులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## గొల్లపల్లిలో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి శ్రీ కృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షులు శాగా శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు. అతని చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలి అదేవిధంగా విగ్రహాలు కూడా ఏర్పాటు చేసుకోవాలి అతని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు శాగ శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షులు అలివేలి సత్తయ్య యాదవ్, క్యాషియర్ పెంజర్ల సత్తయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి శాగ లక్ష్మణ్ యాదవ్, మాజీ అధ్యక్షులు పెంజర్ల నారాయణ యాదవ్, పొన్నవేణి రాజు యాదవ్, అలివేలి అంజయ్య యాదవ్, గొర్రె మల్లేష్ యాదవ్, పెంజర్ల దేవయ్య యాదవ్, పెంజర్ల ప్రభుదాస్ యాదవ్,పెంజర్ల తిరుపతి యాదవ్ శాగ మల్లేష్ యాదవ్, పెంజర్ల రవి యాదవ్, పెంజర్ల అంజయ్య యాదవ్, అక్కేం మల్లేష్ యాదవ్,గొర్రె మల్లేష్ యాదవ్,పెంజర్ల నరేష్ యాదవ్,ఇరుమల్ల రమేష్ యాదవ్, మరియు మాజీ సర్పంచ్ పాశం దేవరెడ్డి, మాజీ కో ఆప్షన్ ఎండ్ జబ్బర్,అందె బాలయ్య,సాయిప్రేమ్ పిట్ల ఎల్లయ్య, మరియు తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**బలగం టీవీ ఎల్లారెడ్డిపేట**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలో ఇటీవల ఓ వ్యక్తి అనారోగ్య సమస్యలతో మృతిచెందగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు బంగ్లా వెంకటయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు ధర్మ గౌడ్. గ్రామానికి చెందిన గణగోని బాల మల్లయ్య ఇటీవల అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెందాడు. బంగ్లా వెంకటయ్య ట్రస్ట్ ద్వారా ధర్మా గౌడ్ వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి 25 కిలోల బియ్యంతో పాటు రెండు వేల రూపాయల నగదును వారి చేతికి ఇచ్చి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకాన్ని విజయవంతం చేయాలి

**-లక్ష్యం మేరకు యువ వికాస రుణాలను సకాలంలో పంపిణీ చేయాలి..**

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

బ్యాంకు మేనేజర్లు స్క్రినింగ్ కమిటీ సమావేశాల్లో హాజరు కావాలని, మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రాజీవ్ యువ వికాసం పై బ్యాంకర్ల తో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ యువ వికాసం అమలుకు ప్రతి బ్యాంకుకు కేటాయించిన లక్ష్యం మేరకు రుణాలను సకాలంలో పంపిణీ చేయాలనీ అన్నారు. రాజీవ్ యువ వికాసం క్రింద మంజూరు చేసే యూనిట్ లకు మున్సిపాలిటీ, మండలాల పరిధిలో ఉన్న బ్యాంకులకు లక్ష్యాలను నిర్దేశించడం జరుగుతుందని, సబ్సిడీ మంజూరైన యూనిట్ లకు తప్పనిసరిగా బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేసి యూనిట్ గ్రౌండింగ్ లో బ్యాంకులు తమ సహాకారం అందించాలని అన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన,తుది ఆమోదం సమయంలో బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ సైతం హాజరు కావాలని అన్నారు.. వివిధ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతీ యువకులకు 50 వేల నుంచి 4 లక్షల రూపాయల వరకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కొరకు రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఈ పథకం క్రింద ఓబిఎంఎస్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవచ్చనిఅన్నారు.

గ్రామాలలో రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన డాక్యుమెంట్ ల పై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం (గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర లోపు, పట్టణ ప్రాంతాలలో 2 లక్షల లోపు) మొదలైనవి అవసరమని,నిర్దేశించుకున్న లక్ష్యాలను సరి చూసుకుని దరఖాస్తుల స్క్రూటినీ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కీమ్యా నాయక్, యు.బి.ఐ బ్యాంక్ రీజినల్ హెడ్ అపర్ణ రెడ్డి, ఎస్.బి.ఐ. రీజినల్ మేనేజర్ వెంకటేష్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్,వివిధ బ్యాంక్ కంట్రోలర్స్ , బ్యాంక్ మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పోరాట స్ఫూర్తికి ప్రతీక దొడ్డి కొమురయ్య..

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం కలెక్టరేట్ లో దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ , జిల్లా అధికారుల తో కలిసి దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భూమి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడి ప్రాణాలు కోల్పోయిన దొడ్డి కొమురయ్య పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి అభివృద్ధి అధికారి రాజ మనోహర్, బిసి నాయకులు, గొల్ల, కురుమ సంఘాల నాయకులు, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు పాదయాత్రలకు సిద్ధం కావాలి



**బలగం టీవీ ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో పాదయాత్రలకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు సిద్ధం కావాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య పిలుపునిచ్చారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామ గ్రామాన కాంగ్రెస్ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించుతూ ముందుకు వెళ్లాలని అన్నారు. పాదయాత్ర చేసిన గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసి అంబేద్కర్ గాంధీ విగ్రహాలు ఉంటే ఆ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేయాలని అన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రతి గ్రామంలో ప్రారంభించాలని లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అన్నారు. అదే మాదిరిగా రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తులు చేసుకోవడానికి ఏప్రిల్ 14 వరకు ప్రభుత్వం పొడిగించినందున ఈ అవకాశాన్ని యువకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి, డైరెక్టర్లు చెట్పల్లి బాలయ్య, మిండేటి శ్రీనివాస్ ,తిరుపతిరెడ్డి, మేడిపల్లి రవీందర్ ,నాయకులు చెన్నిబాబు, గంటబుచ్చా గౌడ్, మల్లారెడ్డి ,లక్ష్మణ్ ,అనవేని రవి తదితరు పాల్గొన్నారు.



**రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315వ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షులు బొంగాని అశోక్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి నాగుల సాంబయ్య గౌడ్, మండల కోశాధికారి మెరుపుల గంగాధర్ గౌడ్, వీరగోని ప్రవీణ్ గౌడ్, బండారి మహేందర్ గౌడ్, ఉయ్యాల తిరుపతి గౌడ్, బుర్ర లచ్చయ్య గౌడ్, నల్లగొండ శ్రీనివాస్ గౌడ్, ఉదారి నరసింహ చారి, ఎడపల్లి పరుశరాములు, బోయిని మల్లేశం యాదవ్, గుంటి తిరుపతి, పెగ్గర్ల రాజశేఖర్, ఎడపల్లి నర్సయ్య, దుద్దెల రాజయ్య, సందరగిరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు. బలగం టీవీ, బోయినిపల్లి**



## బద్దెనపల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ

**బాధిత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పంపిణీ లో భాగంగా గురువారం బద్దెనపల్లి గ్రామంలో ఎ ఎంసీ చైర్మన్ వేముల స్వరూపా తిరుపతిరెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం బియ్యం పంపిణీ నిర్వహించారని గుర్తు చేశారు. అనంతరం వానరాసి శైలజ కు 58,500 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. వారి కుటుంబీకులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోఎ ఏంసి వైస్ చైర్మన్ నేరళ్ళ నరసింగం గౌడ్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు చుక్క రాజశేఖర్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కంటే ఎల్లయ్య, మల్లేష్ బాబు సూర్యారావు,గుగ్గిళ్ల ఎల్లయ్య, డీలర్ చిలువెరి ప్రసన్న నరసయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్‌ది అదే కథ

- ఎస్ఆర్‌హెచ్ హ్యాట్రిక్ ఓటమి
- 80 పరుగుల తేడాతో కేకేఆర్ విజయం

బలగం టీవీ, హైదరాబాద్

సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓడిపోయింది.సమష్టిగా విఫలమై ఓటముల హ్యాట్రిక్ నమోదు చేసింది. గురువారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో.. 80 పరుగుల తేడాతో చిత్తుగా ఓడిపోయింది. దీంతో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి చేరుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన కోల్‌కతా నైట్ రైడర్స్ 6 వికెట్ల నష్టానికి 200 పరుగుల భారీ స్కోరును చేసింది. ఆరంభంలోనే ఇద్దరూ పెవిలియన్ చేరారు. తన మొదటి ఓవర్లోనే హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ క్వింటన్ డికాక్(1) వికెట్ ను పడగొట్టాడు. 14 పరుగుల వద్ద జట్టు మొదటి వికెట్ కోల్పోగా.. తర్వాత ఓవర్లో సునీల్ నరైన్(7)ను షమీ వెనక్కి పంపాడు. అనంతరం కోల్‌కతా నైట్ రైడర్స్ మిడిల్ ఆర్డర్ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చింది, వెంకటేష్ అయ్యర్ 25 బంతుల్లో అర్ధ సెంచరీతో తన విమర్శకులకు సమాధానం ఇచ్చాడు. అంగ్క్రిష్ రఘువంశీ కూడా అర్ధ సెంచరీ సాధించి, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఆతిథ్య జట్టు 200 పరుగులు సాధించడంలో సహాయపడ్డాడు. వెంకటేష్ అయ్యర్(60), రఘువంశీ(50), అజింక్యా రహానే(38) , రింకూసింగ్ రాణించారు. రఘువంశీ 32 బంతుల్లో ఐదు ఫోర్లు, రెండు సిక్సర్లతో 50 పరుగులు చేయగా.. వెంకటేష్ అయ్యర్ 29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో విరుచుకుపడి 60 పరుగులు చేశాడు. ఈ క్రమంలో కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 200 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లు చివరి 5 ఓవర్లలో 78 పరుగులు చేయడం విశేషం. సన్‌రైజర్స్ హైదరాబాద్ కు 201 పరుగులు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. బౌలింగ్ లో మహ్మద్ షమీ, పాట్ కమిన్స్ జీషాన్ అన్సారీ, హర్షల్ పటేల్, కమిందు మెండిస్ తలో వికెట్ పడగొట్టారు.



అయితే సన్‌రైజర్స్‌లో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ లాంటి విధ్వంసకర వీరులు ఉండటంతో విజయంపై ఫ్యాన్స్ ఆశలు కోల్పోలేదు. కానీ ఛేజింగ్ ప్రారంభమైన కాసేపటికే ఆశలు అడియాశలు అయ్యాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. ట్రావిస్ హెడ్ (4), అభిషేక్ శర్మ (2), ఇషాన్ కిషన్ (2) జట్టు స్కోరు పది రన్స్ కూడా కాకముందే పెవిలియన్ చేరారు. ఆ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (19), కామిందు మెండిస్ (27), హెన్రిచ్ క్లాసెన్ (33) కాసేపు నిలబడ్డా గెలిపించలేకపోయారు. చివరకు సన్ రైజర్స్.. 16.4 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌట్ అయింది. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి ముడేసి వికెట్లు తీశారు. ఆండ్రీ రసెల్ 2, హర్షిత్ రాణా 1, సునీల్ నరైన్ 1 వికెట్ పడగొట్టారు.

## సన్‌రైజర్స్‌కు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆఫర్


బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సన్ రైజర్స్ హైదరాబాద్‌కు మధ్య టికెట్ల వివాదం నేపథ్యంలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ బంఫర్ ఆఫర్ ఇచ్చింది. ఎస్ఆర్‌హెచ్‌ను ఏపీకి రావాలని ఆహ్వానించింది. మిగిలిన మ్యాచ్‌లను విశాఖలో నిర్వహించాలని కోరింది. సన్‌రైజర్స్ ఏపీకి వసే పన్ను మినహాయింపుతో పాటు, అద్దె కూడా తీసుకోబోమని, ఇతర సహకారాలు కూడా అందిస్తామని తెలిపింది. సన్‌రైజర్స్ జట్టు నుంచి సమాధానం కోసం ఎదురుచూస్తున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వెల్లడించింది.


అదనపు కాంప్లిమెంటరీ పాసుల కోసం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) తమను బెదిరిస్తున్నదని, ఈ విషయంలో బీసీసీఐ తక్షణమే జోక్యం చేసుకోకుంటే తాము హైదరాబాద్‌ను వదిలివెళ్తామని సన్‌రైజర్స్ విడుదల చేసిన ఈ–మెయిల్ తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ విషయంపై హెచ్‌సీఏ కూడా స్పందించింది. అసలు తమకు ఎస్ఆర్‌హెచ్ నుంచి ఎలాంటి ఈ–మెయిల్ రాలేదని ఓ ప్రకటన విడుదల చేసింది. ఇక ఈ వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దాంతో హెచ్‌సీఏ కార్యదర్శి ఆర్. దేవ్‌రాజ్ సమక్షంలో ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు కిరణ్, శరవణన్, రోహిత్ పాల్గొని చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా.. బీసీసీఐ, ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సీఏ ట్రైపార్టీ ఒప్పందాన్ని కచ్చితంగా పాటించాలని, ఆ మేరకు స్టేడియం సామర్థ్యంలోని అన్ని విభాగాల్లో 10 శాతం కాంప్లిమెంటరీ పాసులను కేటాయించాలని హెచ్‌సీఏ ప్రతిపాదించగా దానికి ఎస్ఆర్‌హెచ్ అంగీకారం తెలిపింది. ఉప్పల్‌లో జరుగబోయే ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సీఏ హామీ ఇచ్చింది. చర్చల అనంతరం వివాదం ముగిసిందని ఇరు వర్గాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. అయితే, ఇప్పుడు ఎస్ఆర్‌హెచ్‌కు ఏసీఏ నుంచి ఆఫర్ రావడం గమనార్హం.

## పాక్ మాజీ టెస్ట్ క్రికెటర్ ఫరూఖ్ హమీద్ కన్నుమూత

బలగం టీవీ, హైదరాబాద్




పాకిస్థాన్‌కు చెందిన మాజీ టెస్ట్ క్రికెటర్ ఫరూఖ్ హమీద్(80) గురువారం దీర్ఘకాలిక అనారోగ్యంతో మరణించారు. ఫరూఖ్ హమీద్ మృతి పట్ల పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఫరూఖ్ హమీద్ 1964 డిసెంబర్‌లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో తన ఏకైక టెస్టు మ్యాచ్ ఆడాడు. కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అయిన ఫరూఖ్ హమీద్ 1961–62 నుంచి 1969–70 వరకు 43 ఫస్ట్–క్లాస్ మ్యాచ్ లు ఆడాడు. ఫరూఖ్ హమీద్ 25.21 సగటుతో మొత్తం 111 వికెట్లు పడగొట్టాడు. వాటిలో మూడు సార్లు ఐదు వికెట్ల చొప్పున పడగొట్టాడు. ఫరూఖ్ హమీద్ 1964–65లో పాకిస్థాన్ జట్టుతో కలిసి ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించాడు. అక్కడ ఫరూఖ్ హమీద్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియాతో తన ఏకైక టెస్టు మ్యాచ్ ఆడాడు. తొలి టెస్ట్ మ్యాచ్ లోనే ఆసీస్ మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ వికెట్ తీసుకున్నాడు. ఫరూఖ్ హమీద్ 1969–70 వరకు పాకిస్థాన్ లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడడం కొనసాగించాడు. కానీ తన దేశం తరఫున ఆడటానికి తగినంత అవకాశాలు రాకపోవడంతో క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. మాజీ టెస్ట్ క్రికెటర్ ఫరూఖ్ హమీద్ మరణం పట్ల పాక్ ప్రధాని మహమ్మద్ షెహబాజ్ షరీఫ్ గురువారం విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. ఫరూఖ్ హమీద్ కుటుంబానికి ప్రధాని హృదయపూర్వక సంతాపం తెలిపారు.




## 'జాక్' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న చిత్రం జాక్ . కొంచెం క్రాక్ అనేది ట్యాగ్‌లైన్. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షుటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే మువీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. సినిమాలో జాక్ అని పిలుచుకొనే జాక్సన్ ఓ ప్రైవేట్ ఏజెంట్. ఓవైపు సీబీఐ ఓ టెర్రరిస్ట్ కోసం అన్వేషిస్తుంటుంది. అదే టెర్రరిస్ట్‌ని పట్టుకోవడానికి జాక్ వస్తాడు. జాక్ పంథానే వేరు. ట్రెడిషనల్ ఇన్వెస్టిగేషన్‌కి భిన్నంగా ఆలోచిస్తాడు. అక్కడి నుంచే ఫన్ మొదలవుతుంది. ఇంతకీ ఆ టెర్రరిస్ట్ ని పట్టుకొన్నారా, లేదా? అనేది మిగిలిన కథ అని ట్రైలర్ ద్వారా తెలుస్తోంది.




## 'కేసరి చాప్టర్ 2' ట్రైలర్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్

బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ నటించిన 'కేసరి చాప్టర్ 2' సినిమా ట్రైలర్‌ను సినిమా యూనిట్ విడుదల చేసింది. ఈ సినిమాకు కరణ్ సింగ్ త్యాగి దర్శకత్వం వహిస్తుండగా మాధవన్, అనన్యపాండేలు కీలక పాత్రలలో నటిస్తున్నారు. ఈ సినిమాకు అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ జలియన్ వాలాబాగ్ అనే ట్యాగ్‌లైన్ ఇచ్చారు. మాధవన్, అక్షయ్‌లో మధ్య జరిగి సన్నివేశాలు, డైలాగ్‌లు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. ఏప్రిల్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారత స్వాతంత్ర సంగ్రామ చరిత్రలో అత్యంత దురదృష్టమైన, హేయమైన సంఘటనగా నిలిచిపోయిన ఘటనలలో జలియన్ వాలాబాగ్ ఉదాంతం ఒకటి. బ్రిటిష్ పాలకుల దుశ్చర్యకు వందలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. అయితే ఈ ఘటనకు సంబం ధించి ఉదాంతం జరిగిన తర్వాత పరిణమాలకు సంబం ధించి ఈ సినిమా రాబోతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది.

## శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ 60వ సినిమా ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్



ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ 60వ ప్రొడక్షన్‌ని ప్రకటించారు. ఈ మూవీలో రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలలో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న ఆశిష్ హీరోగా నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ తో కొత్త డైరెక్టర్ ఆదిత్యరావు గంగాసాని డెబ్యూ చేస్తున్నారు. ఈ మూవీ హైదరాబాద్ ఓల్డ్ సిటీ నేపథ్యంలో సెట్ చేయబడింది, ఆశిష్ స్థానిక యువకుడిగా కనిపిస్తున్నారు. ఆశిష్ ఈ చిత్రం కోసం పూర్తిగా మేకోవర్ కానున్నారు. మరింత ఇంటెన్స్, మాస్–ఓరియెంటెడ్ లుక్‌లో కనిపించబోతున్నారు. ఇక నిర్మాతలు న్యూ ట్యాలెంట్ కోసం ముఖ్యంగా హైదరాబాద్ యాసని చక్కగా మాట్లాడే వారి కోసం కాస్టింగ్ కాల్‌ని ప్రకటించారు. ఈ నటీనటుల ఎంపిక అన్ని వయసుల నటులకు ఓపెన్‌గా వుంటుంది. ఇది ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో భాగం కావడానికి గొప్ప అవకాశం అందిస్తుంది.





## శ్రీకాళహస్తీలో పూజా హెగ్డే

బలగం టీవీ, హైదరాబాద్

నటి పూజా హెగ్డే ఏపీ తిరుపతి జిల్లాలోని ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకుంది. గురువారం ఉదయం శ్రీ కాళహస్తికి వెళ్లిన పూజా రాహుకేతు పూజలో పాల్గొంది. అనంతరం శ్రీ వాయు లింగేశ్వర స్వామి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవిని దర్శించుకుంది. దర్శన అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు శేష వస్త్రంతో పూజాను సత్కరించి, వేద ఆశీర్వచనాలతో.. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. సినిమాల విషయానికి వస్తే.. పూజా ప్రస్తుతం దళపతి విజయ్‌తో జననాయగన్ సినిమాలో నటించడంతో పాటు సూర్య హీరోగా వస్తున్న రెట్రో చిత్రంలో కథానాయికగా నటిస్తుంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

బలగం టీవీ, హైదరాబాద్

దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ప్రతీకార సుంకాల నుంచి ఫార్మా ఉత్పత్తులను ట్రంప్ మినహాయించడంతో ఆ సూచీ స్టాక్స్ రాణించాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 322 పాయింట్లు కోల్పోయి 76,295కి పడిపోయింది. నిఫ్టీ 82 పాయింట్లు పతనమై 23,250 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్‌గా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (4.34%), సన్ ఫార్మా (3.26%), అల్ట్రాటెక్ సిమెంట్ (2.92%), ఎన్టీపీసీ (1.97%), ఏషియన్ పెయింట్ (1.82%) నిలిచాయి. టాప్ లూజర్స్‌గా టీసీఎస్ (–3.98%), టెక్ మహీంద్రా (–3.79%), హెచ్సీఎల్ టెక్నాలజీస్ (–3.71%), ఇన్ఫోసిస్ (–3.41%), టాటా మోటార్స్ (–2.64%) నిలిచాయి.